

విద్యార్థులు ఇంటి బాట

తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

సంక్రాంతి సెలవులకు విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రయివేట్ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు గురువారం బయలుదేరారు. హాస్టల్ విద్యార్థులు సెలవులకు ఇళ్లకు వెళ్లడంతో ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆటో స్టాండ్లు విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడాయి.

- ప్రజాశక్తి, బొబ్బిలి

జెడ్‌పి అంచనా బడ్జెట్ రూ.497.96 కోట్లు

- సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్‌పి, మంత్రులు డుమ్మా
- పింఛన్లు రద్దు, అవినీతి పెచ్చుమీరుతోందన్న సభ్యులు
- అధికారులను తప్పబడితే ఊరుకునేది లేదన్న కలెక్టర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.497.96 కోట్ల జెడ్‌పి అంచనా బడ్జెట్‌ను జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సవరించిన రూ.496.35 కోట్ల బడ్జెట్‌కు కూడా ఆమోదం తెలిపారు. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్తు బడ్జెట్ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్‌పిలు, మంత్రులు డుమ్మాకొట్టారు. దీంతో పాలన, కార్యనిర్వహణ తరపున జిల్లాల కలెక్టర్లే సమాధానం చెప్పారు. సమావేశంలో అధికార పార్టీ నుంచి ఒక్క ప్రజాప్రతినిధి లేకపోయినప్పటికీ చర్చ వాడీవేడిగా సాగడం గమనార్హం. ఒకానొక దశలో 'అధికారులను బ్లేమ్ చేస్తే ఊరుకునేది లేదు. ఆరోపణలు చేసే ముందు సభ్యులు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి, వేక్‌గా మాట్లాడటం సరికాదు..' అంటూ సభ్యులను కలెక్టర్ హెచ్చరించారు. మరో శాఖపై చర్చ నడుస్తుండగా 'అధికార పార్టీ తరపున కలెక్టర్ గారే మాట్లాడేస్తున్నారు..! అంటూ పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎవరికైనా కలెక్టర్‌గా చెప్పాల్సింది నేనే కదా..! అంటూ ఆయన చలోక్తులతో చురకలంటించారు.

మెటీరియల్ కాంపొనెంట్ పనులు పంచాయతీల తీర్మానం లేకుండా చేస్తున్నారని, చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని, అవినీతి జరుగుతోందని విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు ఆరోపించారు. అధికారులకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా? అంటూ ప్రశ్నించారు. దీనికి విజయనగరం కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ పనుల మంజూరు, చెల్లింపులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతి ముద్ర వేయడం మంచిది కాదని, ఎక్కడైనా జరిగితే స్పష్టంగా, వివరంగా రాసి ఇస్తే విజిలెన్సు ద్వారా విచారణ చేపడతామని తెలిపారు. సోషల్ ఆడిట్ పూర్తయిన చోట్ల 10 శాతం నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్.. డ్వామా పీడీకి సూచించారు.

వికలాంగుల పింఛన్లను అనర్హుల పేరుతో తొలగిస్తున్నారనే భయాందోళన ప్రజల్లో ఉందని జిల్లా పరిషత్తు చైర్మన్ అన్నారు. వికలాంగుల పింఛన్లు తొలగించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ఎటువంటి ఉత్తర్వులూ ప్రభుత్వం నుంచి రాలేదని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కేవలం రీవెరిఫికేషన్ మాత్రమే చేస్తున్నామని, ఎటువంటి ఆందోళనా అవసరం లేదని స్పష్టం చేశారు. వెరిఫికేషన్ కోసం ప్రత్యేక వైద్యులతో 6 బృందాలను నియమించామని, రూ.15 వేల పింఛను పొందే వారి ఫొటో తీసి, అక్కడికక్కడే అప్‌లోడ్ చేస్తున్నారని వివరించారు. ఈ దశలో జెడ్‌పి చైర్మన్ స్పందిస్తూ పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్‌ను కోరారు.

వైద్య శాఖ సమీక్షలో భాగంగా హెచ్‌ఎంపివి వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందుతున్నారని సభ్యులు సమావేశంలో లేవనెత్తారు. రాష్ట్రంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. ఆందోళన అవసరం లేదన్నారు. ఉద్యాన శాఖ సమీక్షలో భాగంగా జిల్లాలో మామిడి అధికంగా సాగులో ఉందని, ఎగుమతులు కూడా జరుగుతున్నాయని, మామిడి పంట ఇన్సూరెన్సు కోసం ఎకరానికి 2 వేల రూపాయలను ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ ప్రీమియం తగ్గించాలని, బీమా గడువును కూడా పొడిగించాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపాలని సభ్యులు కోరారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పరిశీలించి లేఖ రాస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా జీడి మామిడి పంటకు హెక్టారుకు 4 వేల రూపాయలు ప్రీమియం ఉందని, దానిని తగ్గించాలని లేఖ రాసినట్లు మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

తాటిపూడి బోటు షికారు కోసం అన్ని రకాల అనుమతులు ఉన్నాయా, పర్యాటకుల భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు? అని జిల్లా పరిషత్ చైర్మన్.. జలవనరులు, పర్యాటక శాఖల అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ స్పందిస్తూ అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, పర్యాటక కార్పొరేషన్, బోటు నడిపే కంపెనీ వారు ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. ఇందులో భద్రత, ధర, ఇతర అంశాలపై చర్చించి బోటు నడపాలా? వద్దా? అనే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, రెండు జిల్లాలకు చెందిన అధికారులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జలాశయాలకు మహనీయుల పేర్లు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

తొలుత జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో జలాశయాల నిర్మాణానికి కృషి చేసిన మహనీయుల పేర్లను పెట్టుకొని భావితరాలకు వారి సేవలను గుర్తుండేలా చేయడం గొప్ప విషయమని అన్నారు. ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను కూడా నిర్మించి పార్కులను ఏర్పాటు చేస్తే వారికీ సముచితమైన గుర్తింపునిచ్చినట్లు అవుతుందని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టుకు సర్దార్ గౌతు లచ్చన్న పేరును, జంఝావతికి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు పేరును, మడ్డువలసకు గొర్లె శ్రీరాములు నాయుడు పేరును, తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పెట్టడం జరిగిందన్నారు. ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను ఏర్పాటు చేసి, పార్కులను నిర్మించి సుందరంగా తీర్చిదిద్దాలని, నిధులు అవసరమైతే జిల్లా పరిషత్తు నుంచి సమకూరుస్తామని తెలిపారు. ఈ ప్రతిపాదనను సమావేశం తీర్మానించింది.

పేరుకుపోయిన బకాయిలు

- 18 నెలలుగా చెల్లించని రూ.22 కోట్లు
- ఆర్థిక బాధలు నుంచి తప్పించాలని కాంట్రాక్టర్ల వేడుకోలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్టర్లు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబో మంటున్నారు. 18 నెలలుగా సుమారుగా రూ.22కోట్లు పైన బిల్లులు పేరుకుపోయాయి. దీంతో బిల్లుల కోసం ఎక్కని మెట్లు లేవు. విన్నవించుకొనని ప్రజాప్రతినిధి లేరు. బిల్లుల కోసం నగర పాలక సంస్థ అధికారుల చుట్టూ తిరిగితే తప్ప బిల్లులు అవ్వని దుస్థితి నెలకొంది. గత ఏడాది కాలంగా కాళ్లు అరిగేలా తిరిగినా బిల్లులు చెల్లించడంలో జాప్యం జరుగుతునే ఉంది. దీంతో కనీసం సంక్రాంతి పండగకు అయినా బిల్లులు వస్తే తమను నమ్ముకున్న కార్మికులకు, కూలీలకు డబ్బులు ఇచ్చే పరిస్తితి ఉంటుందని, లేకుంటే తమతో ఉన్న కొన్ని వందల కుటుంబాలు సంక్రాంతి పండగ పస్తులతో గడపాల్సిన పరిస్తితి నెలకొందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు బిల్లులు అప్ లోడ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం డబ్బులు విడుదల చేయకపోవడంతో కోట్లాది రూపాయిలు బిల్లులు పెండింగ్ లో ఉండిపోయాయి. దీంతో బిల్లులు పండగ ముందు వస్తాయో రావోనని ఆందోళన చెందుతున్నారు.

మంత్రి కొండపల్లికి వినతి

తమకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కాంట్రాక్టర్లు వినతి అందజేశారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పండగ ముందే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

నేటి నుంచి గోకులాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో నిర్మాణం పూర్తయిన గోకులాలను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎంపిడిఒలను ఆదేశించారు. ఆయా మండలాల్లో ప్రజా ప్రతినిధులతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని ఎంపిడిఒలతో గురువారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 981 గోకులాలను మంజూరు చేసినట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్న వాటిని నెలాఖరుకల్లా పూర్తిచేసి, వాటిని కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గోకులాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో పూర్తయిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో వెనువెంటనే అప్ లోడ్ చేయాలని సూచించారు. రూ.45 కోట్ల విలువైన 866 పనులను పూర్తిచేసినప్పటికీ రూ.23 కోట్ల బిల్లులనే అప్‌లోడ్ చేశారని చెప్పారు. పూర్తయిన పనులకు బిల్లులను కూడా వెంటనే అప్‌లోడ్ చేయడంపై శ్రద్ధ చూపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్తు సిఇఒ బి.వి.సత్యనారాయణ, డ్వామా పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్, డిపిఒ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్టయిఫండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం నిర్వహించిన పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులకు గాను 375 మంది హాజరయ్యారు.

నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టికెట్స్ పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.బాపూజీ, టి.ఎన్.శ్రీనివాసరావు, కె..థామస్‌రెడ్డి, ఎఒ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న అంగన్వాడీ యూనియన్, సిఐటియు నాయకులు

అంగన్వాడీలకు జీతాలు ఇప్పించండి

కలెక్టర్‌కు యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలకు డిసెంబర్ నెల జీతాలు ఇచ్చినా, జిల్లాలో మాత్రం నేటికీ వేయలేదని, సంక్రాంతి పండగ నేపథ్యంలో వెంటనే జీతాలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ అంబేద్కర్‌ను కలిసి వినతి అందజేశారు. జిల్లాలో పీడీ సెలవులో ఉన్నారనే కారణంతో అంగన్వాడీలకు డిసెంబర్ నెల జీతాలు వేయలేదని తెలిపారు. సంక్రాంతి పండగ పూట జీతాలు పడకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే అంగన్వాడీలకు జీతాలు వేసేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే జీతాలు వచ్చేటట్లు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

గుర్తుతెలియని వాహనం ఢీకొన్న కేసుల్లో బాధితులకు పరిహారం మంజూరు : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, రవాణా, జాతీయ రహదారుల సంస్థలతో కలసి పకడ్బందీ చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. రహదారులపై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, నివారించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చర్యలు చేపడతామన్నారు. గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న ఘటనల్లో గాయపడిన, మరణించిన వారికి సహాయం అందించేందుకు ఉద్దేశించి ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారులపైనే ఈ తరహా కేసులు అధికంగా వస్తున్నాయని పోలీసు అధికారులు వివరించారు. గొట్లాం వద్ద జాతీయ రహదారి కూడలిలో తగినంత వెలుతురు లేకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోందని అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రతి నెలా సగటున ఆరు నుంచి ఏడు గుర్తు తెలియని వాహనం ఢీకొన్న కేసులు నమోదవుతున్నట్టు చెప్పారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడిన లేదా మరణించిన ఘటనల్లో బాధితులకు నెల రోజుల్లోగా పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో నలుగురు బాధితులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఆమోదించారు. ఈ ఘటనల్లో మృతులకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం అందిస్తూ ప్రభుత్వం జిఒ జారీ చేసినట్లు డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ సభ్యుడు మజ్జి అప్పారావుకు చెందిన రోడ్ సేఫ్టీ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలపై రూపొందించిన బ్యానర్‌ను, రోడ్డుభద్రతపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన ప్లకార్డ్ ను కలెక్టర్ అంబేద్కర్, అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు ఆవిష్కరించారు. సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు రామ్మోహన రావు, సత్యవాణి, కీర్తి, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి డిఎస్‌పిలు శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాఘవులు, జిల్లాస్థాయి కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ పరిపాలన అధికారి పి.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాత, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ • క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాతృ శిశు మరణాలు సంభవిస్తే, సంభందిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. గత ఐదు మాసాల్లో జిల్లాలో జరిగిన మాతృ, శిశు మరణాలపై కలెక్టరేట్ లో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. మొత్తం పది మాతృ, ఆరు శిశు మరణాలపై కేసుల వారీగా వివరాలు తెలుసుకున్నారు. మరణాలకు కారణాలు, వారికి అందించిన చికిత్స, ఇతర పరిస్థితులపై ఆరా తీశారు. కొన్ని కేసుల్లో సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా, శిశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, వివిధ శాఖల ఆధ్వర్యంలో విస్తత స్థాయి యంత్రాంగం పని చేస్తోందని చెప్పారు. అయినప్పటికీ మరణాలు సంభవించడం బాధాకరమని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బందిని చైతన్య పరచడం ద్వారా గర్భిణులు, శిశువుల పై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా తీసుకొనే విధంగా, ఇస్తున్న మందులను సరిగ్గా వాడే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చిన్న వయసులో గర్భాలను నిరోధించేందుకు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వివిధ స్థాయిలో పని చేస్తున్న వైద్యాధికారులు, కిందిస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాలో మరణాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజేశ్వరి, డిఐఒ డాక్టర్ అచ్చుతకుమారి, ఐసిడిఎస్ పీడీ సుధారాణి, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు, ఎర్రచెరువు పేదలు

ఎర్రచెరువు పేదలకు న్యాయం చేయాలి

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఎర్ర చెరువు గర్భంలో నివాసముంటున్న వారు అక్కడినుంచి ఖాళీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నోటీసు జారీ చేయడం పట్ల పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు ఖండించారు. దీన్ని నిరసిస్తూ పేదల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇళ్లు చెరువు గర్భంలో లేవని, వారికి ప్రభుత్వమే పట్టాలిచ్చిందని, బ్యాంకులు రుణాలిచ్చి ఇల్లు కట్టించారని తెలిపారు. ఇప్పుడు చెరువు గర్భంలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరైనది కాదన్నారు. తాత, తండ్రుల నుండి ఇక్కడే నివాసముంటున్నారని, వీరికి పట్టాలు, కరెంటు, మున్సిపల్ పన్ను, ఇంటి రుణం కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. వాస్తవానికి చెరువు కబ్జా చేసి నవారి పై చర్యతీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోరాడుతుంటే పేదలయిఅ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. 46వ వార్డు గురజాడ నగర్, వినాయక నగర్‌లో కనీసం తాగేందుకు మంచి నీరులేదని, వెంటనే ట్యాంకర్ ద్వారా నీరు పంపించాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, పిపిఎస్ఎస్ నాయకులు ఆది, చంటి, సాయి,సూరిబాబు, రవి, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించండి

విజయనగరంలీగల్ : మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి సూచించారు. గురువారం ఎస్‌పి వకుల్‌జిందాల్, ఇతర అధికారులతో తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి వారెంట్ పెండింగ్ ఉన్న కేసుల వివరాలు సేకరించి వాటిని జరగబోయే జాతీ లోక్ అదాలతో పరిష్కరించాలని తెలిపారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి త్వరగా విచారణ జరిపి ఆన్‌లైన్ పోర్టల్‌లో బాధితుల వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మీనా దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పివి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా వెంకటేశ్వర్రావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపి మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్‌గా ఎన్.వెంకటేశ్వర్రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు ఉద్యానశాఖలో విధులు నిర్వహిస్తూ, డిప్యుటేషన్‌పై డిఎంగా చేరారు. ఇంతకుముందు ఈ స్థానంలో వై.విమలకుమారి డిఎంగా పనిచేసి, పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ముందుగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను కలిసి అనుమతి తీసుకున్న అనంతరం వెంకటేశ్వర్రావు డిఎంగా బాధ్యతలు స్వీకరించారు.

వినూత్న విధానాలను వినియోగించుకోవాలి

మెప్మా పీడీ చిట్టిరాజు

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ ప్రొవైడర్లకు అందిస్తున్న వినూత్న విధానాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మెప్మా పథక సంచాలకులు చిట్టిరాజు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ సంస్కృత కళాశాలలో నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధానాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో సర్వీస్ ప్రొవైడర్లకు మరింత వినూత్నమైన శిక్షణను అందిస్తూ వారి ప్రతిభను మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఎసి, ఫ్రిడ్జ్, టివి మెకానిక్‌లకు మరింత తర్ఫీదు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం, సిటి మిషన్ మేనేజర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం, గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి- మెంటాడ

తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సోములు మాట్లాడుతూ కూనేరు పంచాయతీలోని ఎగువ మిర్తివలస, దిగువ మిర్తివలస, ఉద్దంగి పంచాయతీలోని కొత్తూరులో తాగునీరు, రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. కలుషితమైన కొండవాగుల నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

కొత్తూరులో స్వచ్ఛంద సంస్థ మూడేళ్ల క్రితం బోరుబావి తీసిందని, దాని ద్వారా బురదనీరు రావడంతో ఇక్కడ గిరిజనులు వాగుల నీటినే వినియోగిస్తున్నారని చెప్పారు. తక్షణమే ఆయా గిరిజన గ్రామాలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, ఎంపిడిఒ ఎం.భానుమూర్తికి వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచన విధానం వైసిపి సిద్ధాంతం

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంబేద్కర్ ఆలోచన విధానమే వైసిపి సిద్ధాంతమని జెడ్‌పి చైర్మన్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం, అంబేద్కర్ స్మృతి వనం, 125 అడుగుల డాక్టర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగి ఈనెల 19 నాటికి ఏడాది అవుతున్న సందర్భంగా అంబేద్కర్ రైట్స్ ఫోరమ్ రూపొందించిన కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంబేద్కర్ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇస్తుందని, దీనికి ప్రత్యక్ష ఉదాహరణ విజయవాడలోని అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన నిందితులపై నేటికీ చర్యలు తీసుకోకపోవడమేనని అన్నారు. దళిత ఐఎఎస్ ఐపిఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత ధోరణి అవలంభిస్తోందని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ రైట్స్ ఫోరమ్ ప్రతినిధులు భానుమూర్తి, దారాన వెంకటేష్, వేముల వంశీ, బుద రాయవలస మధుసూదన రావు, ఆంధ్రప్రదేశ్ టూరిజం మాజీ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే : కాంగ్రెస్

ప్రజాశక్తి-బొబ్బిలి

తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముర్వల శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖలో ప్రధాని మోడీ పర్యటనకు 5 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారని తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది తిరుపతి వస్తారని తెలిసినా, కౌంటర్ వద్ద ఐదుగురు పోలీసులను పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సరైన బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హైందవ శంఖారావానికి అర్థం ఇదేనా? అని నిలదీశారు.

ఏర్పాట్లలో యంత్రాంగం వైఫల్యం : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

తిరుపతికి లక్షలాది మంది వస్తారని తెలిసినా, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి తొక్కిసలాటలో ఏడుగురు మరణించడం, 40 మందికి తీవ్ర గాయాలు కావడం పట్ల విచారం వ్యక్తంచేశారు. లక్షలాది మంది యాత్రికులు వస్తారని తెలిసి కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం ఈ విషాద ఘటనకు కారణమని అభిప్రాయ పడ్డారు. హైందవ శంఖారావానికి, విశాఖలో ప్రధాని మోడీ సభకు వేలాది మంది పోలీసులను పక్క జిల్లాల నుంచి రప్పించి బందోబస్తు ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం.. తిరుపతిలో సరైన ఏర్పాట్లు చేయకపోవడం దారుణమని చెప్పారు. ప్రజల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యం కనబడుతోందని తెలిపారు.

విద్యార్థులకు బట్టలు అందజేస్తున్న ఎంఇఒలు విమలమ్మ, సాయి చక్రధర్

అనాథ విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న అనాథ విద్యార్థులకు, బాలల సదనంలో గల విద్యార్థులకు గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఇఒలు ఎస్. విమలమ్మ, బి. సాయి చక్రధర్ నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సుమారు పాతిక వేల రూపాయలతో కొనుగోలు చేసిన వస్త్రాలను 34 మంది అనాథ విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎంఇఒలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టామని, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఈ నిధులను విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బిజి బి శ్రీనివాస్ ,రెండ్ల జగదీష్, అద్దూరి పైడితల్లి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 291 దరఖాస్తులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 291 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మొత్తం 291 దరఖాస్తులు రాగా, 47 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు చెప్పారు. మిగతా దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిబంధన మేరకు దరఖాస్తుదారులకు న్యాయం చేస్తామన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని నారశింహునిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర వారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పనులు చేయడంతో సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. కలవరాయి ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల ఉదారత

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉదారతను చాటుకున్నారు. మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థిని, విద్యార్థులకు సంక్రాంతి సందర్భంగా గురువారం స్థానిక ఎంఆర్‌సిలో నూతన దుస్తులను పంపిణీ చేశారు. 15 మంది విద్యార్థులకు ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘ నాయకులు సహకారంతో మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్పందించి విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు జెసి రాజు, ప్రసన్న కుమార్, బి.రవికుమార్, శంకరరావు, కె.శ్రీను, హెచ్‌ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని పలు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సొంత నిధులు ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రులు లేని 11 మంది పేద విద్యార్థులకు రెండు జతలు బట్టలు అందజేశారు. సంక్రాంతి ఖర్చుల నిమిత్తం ఒక్కొ విద్యార్థికి రూ.1500 ఎంఇఒలు ఎం వరప్రసాద్ రావు, ఎరకయ్య చేతులు మీదుగా గురువారం అందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చొరవతో రెండు జతలు బట్టలు, నగదు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సంక్రాంతి కానుకగా తల్లిదండ్రులు లేని పిల్లలకు వారి జీవితాల్లో కూడా వెలుగులు నింపే కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు లక్ష్మణరావు, మురపాక వెంకటరమణ, చింత శ్రీధర్ సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

రిజర్వ్ స్థలం అమ్మకంపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి-పార్వతీపురం రోడ్డులో స్పైసి దాబాకు ఎదురుగా ఉన్న లే అవుట్లో రిజర్వ్ స్థలాన్ని విక్రయించడంతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, టిపిఒ రేవతి, మున్సిపల్ ఆర్ఐ సురేష్ గురువారం పరిశీలించారు. రిజర్వ్ స్థలాన్ని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిజర్వ్ స్థలం ప్రజా అవసరాలకు ఉపయోగ పడేలా చూడాలన్నారు. రిజర్వ్ స్థలాన్ని అమ్మిన వారికి, కొనుగోలు చేసిన వారికి నోటీసులు జారీ చేయాలని టిపిఒను ఆదేశించారు.

స్థల పరిశీలన చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సత్యవతి

ట్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో ఎస్‌సి కాలనీలో మినీ రక్షిత తాగునీటి పథకంలో ట్యాంకు ఏర్పాటుకు గురువారం పంచాయతీ కార్యదర్శి వై.సత్యవతి, డిజిటల్ అసిస్టెంట్ పి.నవీన్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. ఎస్‌సి కాలనీలో 68 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు వినతి అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు.

జూదం నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-వేపాడ

తీర్థాల్లో జూదం, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శృంగవరపుకోట రూరల్ సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గురువారం వేపాడ మండలం బొద్దాంలో రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సంక్రాంతి నుంచి తీర్థాలు నిర్వహిస్తారని తెలిపారు. తీర్థాల్లో కోడిపందేలు, గుండ్లు ఆట, జూదం, రికార్డింగ్ డ్యాన్సులు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

600 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి-కొత్తవలస

ముసిరాం గ్రామంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యాన సిబ్బంది గురువారం దాడులు చేపట్టారు. సుమారు 600 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. రామలింగాపురం గ్రామ శివారులో ఐదు లీటర్ల సారాతో ఓ మహిళ పట్టుబడింది. ఆమెను విశాఖలోని సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు ఎన్.రమ్యశ్రీ, వి.ఎన్.రాజు, హెచ్‌సి టి.వీర్రాజు, సిబ్బంది బి.రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫోర్టుసిటీ, ఎయిమ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఫోర్టు సిటీ స్కూలులో సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను, పండుగ జరుపుకొనే విధానాలను విద్యార్థులు నృత్యరూపంలోను, నాటికల రూపంలోను ప్రదర్శించారు. విద్యార్థులు హరిదాసు, సోదెమ్మ వేషాలు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. సంబరాల్లో పాల్గొన్న పాఠశాల చైర్మన్ కె.వి.పి. రాజు(శివ) మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతీ పండగ ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలన్నారు. రైతన్నలు మెచ్చే ఈ సంక్రాంతి పండగనాడు అందరూ సాంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. ఈ సంబరాల్లో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రీయాజ్ ఖాన్, డైరెక్టర్లు మధు అశోక్, నీలిమ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తోటపాలెంలోని ఎయిమ్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా పాఠశాల ఆవరణను తీర్చిదిద్దారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు వస్త్రధారణతో అలరించారు. చిన్నారులకు పాఠశాల పరిపాలనాధికారులు భోగిపళ్లు పోశారు. భోగిమంటలను వెలిగించి, గొబ్బెమ్మలను పెట్టారు. గాలి పటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కదగల ఆనంద్‌కుమార్, ఎఒ బాలాజీ, సురేష్, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి : బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగురవేసే, భోగిమంట వేశారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్నారు. జానపద నృత్యాలు, విద్యార్థినుల కోలాటం అందరినీ అలరించాయి.

కొత్తవలస : కొత్తవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఎంఇఒ బండారు శ్రీనివాస్ రావు, ప్రధానోపాధ్యాయులు చీపురుపల్లి ఈశ్వర్‌రావు ప్రారంభించారు. రంగవల్లులతో కోలాటం, హరిదాసు వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. టెడ్డీబేర్, విచిత్ర వేషధారణలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎయిమ్ పాఠశాలలో హరిదాసు వేషధారణలో విద్యార్థులు

వేపాడ : మండలంలో బక్కునాయుడుపేట వద్ద ఉన్న గురుకులంలో బాలికలు ముందస్తు సంక్రాంతి సంబరా లు నిర్వ హించారు. ముగ్గులతో గురుకుల ప్రాంగణాన్ని అలంకరించారు. భోగి మంటలు వేసి, హరిదాసు వేషధార ణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, అధ్యాపకులు ఉషారాణి పాల్గొన్నారు. సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ బిపిఎ రాజు ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు జరిగాయి.



వేపాడ.. గురుకులంలో హరిదాసు వేషధారణలో విద్యార్థిని

నెల్లిమర్ల : మండలంలోని తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యా యులు బంగారయ్య సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ పెద్దలు, యూత్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి ఉత్సాహ ంగా నిర్వహించారు. ముందుగా పూజలు చేసి భోగిమంటలు వేసి దానిచుట్టూ జానపద పాటలు పాడుతూ చప్పట్లు కొడుతూ పెద్దలు, పిల్లలు అందరూ డ్యాన్స్‌లు వేస్తూ తిరిగారు. ఈ సందర్భంగా పిల్లలు వేసిన వేశధారణలు ఆకట్టుకున్నాయి.

మెరకముడిదాం: మండలంలోని ఎంఎస్ఎన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిన్నబంటపల్లి ఎంపియుపి పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు రంగవల్లి పోటీలు, బోగి మంటలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సాహంగా పాటలు, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో చినబంటుపల్లి ఎంపియుపి పాఠశాల హెచ్‌ఎం అల్లి రాంబాబు, ఎంఎస్ఎన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి పండుగ సంబరాలను ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోర్టుసిటీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

గజపతినగరం : స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమేష్‌కుమార్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. బోగి మంటలు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. విద్యార్థినుల కర్రసాము ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని అక్కివరం మోడల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలను ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు, గొబ్బెమ్మలు భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ కంది కిరణ్ కుమార్, ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య పాల్గొన్నారు.

డెంకాడ : సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎంపిపి, మాజీఎంపిపి, ఉపాధ్యాయులు

పరిష్కరించిన దరఖాస్తులకు ఆడిట్

రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ అర్జీని పరిష్కరించాలి
12 లోగా పైలెట్ గ్రామాల సరిహద్దులను ఖరారు చేయాలి
కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును తప్పనిసరిగా, సానుకూలంగా పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తాహశీల్దార్లు పరిష్కరించిన ప్రతి దరఖాస్తును ఆడిట్ చేస్తామని చెప్పారు. సదస్సుల్లో మొత్తం 6846 దరఖాస్తులు రాగా, వీటిలో 4924 దరఖాస్తులు రెవెన్యూకు సంబంధించినవే అని చెప్పారు. ఈ దరఖాస్తులను పరిష్కరిస్తే జిల్లాలో రెవెన్యూ పరమైన సమస్యలన్నీ దాదాపు పరిష్కరించినట్టేనని తెలిపారు. కోర్టులనుంచి ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఉన్నవి మినహా, వివాదాలు ఉన్న భూములను కూడా పరిష్కరించవచ్చునని సూచించారు. రీ సర్వే కోసం ప్రతీ మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూముల హద్దులను ఈనెల 12లోగా ఖరారు చేయాలని ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసారు. ప్రతీ ఫైలు ఈ ఆఫీసులో మాత్రమే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ, పైలెట్ గ్రామాల సరిహద్దులను ఖరారు చేసే విషయంలో సర్వేయర్లు తీవ్రజాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రీసర్వే, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే పిజిఆర్ఎస్, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి సమీక్షించారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు డి.కీర్తి, రామ్మోహన్, సత్యవాణి, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి మురళి, సర్వేశాఖ ఎడి రమణమూర్తి, తహశీల్దార్లు, సర్వేయర్లు, డిటిలు పాల్గొన్నారు.

ఎల్‌జిఒఇతో సీతం ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం

సత్య ఇంజినీరింగ్ కళాశాల, లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. ఎల్‌జిఒఇ మేనేజింగ్ డైరెక్టర్ లగడపాటి శ్రీనివాసరావు, సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి ఈ ఎంఒయుపై సంతకం చేశారు. ఈ ఒప్పందం ద్వారా లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ శిక్షణ, విద్య, నియామకం, పారిశ్రామిక సందర్శన, నిపుణుల ఉపన్యాసంలో సహకారంపై వారి ప్రయత్నాలను సహకరించడం, కేంద్రీకరించడం, కెరీర్ కన్సల్టెన్సీ, ప్లేస్‌మెంట్ సేవలను సీతం విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ సీతం విద్యార్థులు వివిధ దేశాలలో ఉన్నత విద్యలను అభ్యసించడానికి, ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ల ద్వారా ఉపాధ్యాయుల ఉన్నతికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు.

అవార్డు అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

డిజి స్కోప్ తయారీలో ఉమామహేశ్వరరావుకు అవార్డు

జాతీయ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో డిజి స్కోప్ తయారీలో జిల్లా ఉపాధ్యాయుడు సిహెచ్ ఉమామహేశ్వరరావుకు అవార్డు లభించింది. విజయవాడలో ఈనెల 7,8 తేదీల్లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆయన తయారు చేసి డిజి స్కోప్ ప్రాజెక్టు ఎంపికవ్వడంతో ఎస్‌పిడి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. విజయనగరం జిల్లా నుండి సిహెచ్ ఉమామహేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ఉపాధ్యాయ విభాగంలో దక్షిణ భారత స్థాయికి ఎంపికయ్యారు. పాండిచ్చేరిలో ఈనెల20 నుండి 25 వరకు జరిగే దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావును డిఇఒ మాణిక్యం నాయుడు అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి- గరివిడి రూరల్

మండలంలోని కాపుశంభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. అందుకు అయ్యే ఖర్చును పాఠశాల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ కొమ్ము మోహన్ కృష్ణ మాస్టారు భరించి విద్యార్థులకు ఈ పుస్తకాలను అందించారు. విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆయన ఆకాంక్షించారు. కొమ్ము మోహన్ కృష్ణని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి రాము, యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది బి.పావని, కె.జనార్ధన రావు, పి.ప్రకాష్ రావు, బి సరస్వతి, భూరి అనంతరావు, చల్లా సింహాచలం, జి.వి శ్రీదేవి, బి పార్వతి, ఎమ్ పద్మజ తదితరులు అభినందించారు.

పలు ప్రాంతాల్లో అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 21వ డివిజన్‌లో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లితో కలిసి పర్యటించారు. నాగవంశపువీధిలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గమనించారు. గుర్తించిన క్షేత్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. కమేళా ప్రక్కన ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని కార్పొరేటర్ కోరారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చేతికర్రలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

వృద్ధులకు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు హ్యాండ్ స్టిక్స్ (చేతికర్రలు)ను గురువారం పంపిణీ చేశారు. వృద్ధులకు చేయూత కోసం స్టిక్స్ పంపిణీ చేస్తున్నట్టు శ్రీనివాసరావు చెప్పారు. 750 మందికి స్టిక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

పుష్పితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్రికెట్‌లో సత్తాచాటిన పుష్పిత

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె.పుష్పిత.. అండర్-15 క్రికెట్‌లో సత్తాచాటింది. భువనేశ్వర్, రాజస్థాన్, పంజాబ్ జట్లతో జరిగిన మ్యాచుల్లో మొత్తం 252 పరుగులు చేసింది. దీంతో అండర్-17లో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టులో చోటులభించింది. పుష్పితను ప్రధానోపాధ్యాయులు చీపురుపల్లి ఈశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మెంటాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదా సాగింది. తొలుత వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు సమర్పించారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలు, పరిష్కారం దిశలో ఉన్న పనులను చదివి వినిపించారు. ఈ సమావేశానికి హాజరు కాని అధికారులు వచ్చే సమావేశానికి తప్పక హాజరు కావాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎంపిపి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.భానుమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, ఎఒ గోకుల్ కృష్ణ, హౌసింగ్ ఎఇ డేవిడ్ ప్రసన్న కుమార్, ఎంపిటిసిలు పతివాడ కుమార్, రెడ్డి ఎర్రన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే నోటీసులు

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. పట్టణంలో శ్వేతచలపతి స్కూల్ రోడ్డు, మెయిన్ రోడ్డు, మార్కెట్, మహారాణిపేట, గొల్లవీధి ప్రాంతాల్లో గురువారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయొద్దని హెచ్చరిస్తున్నా కొంతమంది వేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి జరిమానా వేయాలని అధికారులకు సూచించారు. గొల్లవీధి మెయిన్ రోడ్డులో ఖాళీ ప్రాంతంలో ఉన్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. చిన్న చెరువు గట్టు వీధిలో కాలువల్లో పూడికలను గుర్తించి, తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

కైలాస భూమి నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని తోటపాలెం రోటరీ సెంట్రల్ క్లబ్ చేపట్టిన కైలాష్ భూమి నిర్మాణం కోసం దాత ఎస్‌కెవివిఎస్ఎస్ఎన్ రాజు (వాసు రాజు) గురువారం 2లక్షల రూపాయల విరాళం అందించారు. ఈ చెక్కును కైలాస భూమి చైర్మన్ టి.ఎల్.ఎన్.మూర్తి, కోశాధికారి ఆర్.శంకర్ రెడ్డి అందుకున్నారు. ఈమేరకు రోటరీ సెంట్రల్ క్లబ్ కార్యదర్శి, కైలాస భూమి కోశాధికారి ఆర్. శంకర్ రెడ్డి మాట్లాడుతూ కైలాస భూమిలో గ్యాస్ బర్నర్ కు, ప్లాట్ ఫారం నిర్మాణం కోసం ఈ నిధులు ఖర్చు చేస్తామన్నారు. రోటరీ విజయనగరం సెంట్రల్ క్లబ్ వారు చేస్తున్నా సేవా కార్యక్రమాలలో భాగంగా రోటరీ హెల్త్ సెంటర్ ద్వారా కేవలం 10 రూపాయలకే విజయనగరంలో ఉన్న అత్యుత్తమ డాక్టర్లతో సేవలు అందుస్తున్నామని తెలిపారు.

నిరసన తెలుపుతున్న దళితులు

రేషన్ డిపోను ఎస్‌సిలకు కేటాయించాలి

బూరాడ దళితుల ఆందోళన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ రేషన్ డీలర్ పోస్ట్‌ని ఎస్‌సిలకు కేటాయించాలని దళిత జెఎసి అధ్యక్షుడు తేగల మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం బూరాడ గ్రామంలో దళితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రేషన్ దుకాణాల్లో ఒకటి బిసిలకు ఉందని, రెండవది కాళీ అవ్వడంతో అది ప్రభుత్వం ఈడబ్ల్యుఎస్‌కి కేటాయించారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు, తరువాత ఆ గ్రామం లో అధిక మొత్తంలో ఎస్‌సిలు ఉన్నారని ఈ నేపథ్యంలో ఒకటి ఎస్‌సిలకు కేటాయించాలని కోరారు.

వృత్తిదార్లకు ఉపాధిపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో వృత్తిదార్లకు ఉపాధి పెంపుదలపై గురువారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో మెప్మా, హెూమ్ ట్రయాంగిల్ సంయుక్త అధ్వర్యంలో అనుభవం కలిగిన గృహోపకరణలపై అవగాహన కల్పించారు. ఏసి, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ రిపేర్ చేయడం, వృత్తి సంబంధిత సేవలు వడ్రంగి, ప్లంబింగ్, విద్యుత్, బ్యూటీషియన్స్ వంటి పని చేస్తున్న వారిని గుర్తించి వారికి ఉపాధిని పెంపోదించుటకు సర్వీస్ ప్రొవైడర్ల నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పథక సంచాలకులు జి.వి చిట్టి రాజు, నగర పంచాయతీ కమిషనర్ కె అప్పలరాజు, మెప్మా ఐబి జి.రాము, సిఎంఎం డి.గోవిందరావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి

రేగిడి : గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని రేగిడి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సోహిణి రసీవ్ అన్నారు. గురువారం రేగిడి ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోషకాహారం తింటే పుట్టబోయే చిన్నారులు ఆరోగ్యంగా పుడతారన్నారు. క్రమం తప్పకుండా నెలవారి తనిఖీలు చేసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరితో సిహెచ్ఒ సుందరేశ్వర్, హెచ్‌విలు అప్పారావు, పుష్ప ఉన్నారు.